నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల వనపర్తి
3 మహబూబ్‌నగర్, శుక్రవారం 29 నవంబర్ 2024 JOGULAMBA GADWAL WANAPARTHY

# గురుకులం నుంచి ఇద్దరు విద్యార్థులు పరారీ

- గుంటూరులో గుర్తించిన చైల్డ్‌లైన్ సిబ్బంది

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 28 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకులం బాలుర-3 నుంచి ఇద్దరు విద్యార్థులు పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. షాషాబ్‌గుట్ట పెద్ద శివాలయం సమీపంలోని సరోజినీ రాములమ్మ ఫార్మసీ కళాశాల భవన సముదాయంలో నిర్వహిస్తున్న మైనార్టీ గురుకులంలో 8వ తరగతి చదువుతున్న ముస్తఫా, అహ్మద్ ఈనెల 26వ తేదీన రాత్రి గురుకులం కిటికీ నుంచి దూకి పారిపోయారు. తెల్లవారుజామున ఇద్దరు విద్యార్థులు కన్పించడం లేదనే సమాచారంతో సీసీ కెమెరాలు పరిశీలించగా, కిటికీ దూకి పారిపోయినట్లు సిబ్బంది గుర్తించారు. ఈ విషయంపై సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పోలీసులకు ఇవ్వకపోవడం విశేషం. కాగా, మైనార్టీ గురుకులం నుంచి పారిపోయిన విద్యార్థులను గుంటూరు రైల్వేస్టేషన్‌లో చైల్డ్‌లైన్ సిబ్బంది, పోలీసులు గుర్తించారు. ముస్తఫా అమ్మను చూసేందుకు గురుకులం నుంచి బయటకు వచ్చినట్లు విద్యార్థులు తెలిపినట్లు సమాచారం. విద్యార్థులు క్షేమంగా ఉన్నారనే సమాచారంతో గురుకుల సిబ్బంది, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.



మహబూబ్‌నగర్‌లోని గురుకుల పాఠశాల

# మధ్యాహ్న భోజనం తిని నలుగురికి అస్వస్థత

- గొరిట ప్రాథమిక పాఠశాలలో ఘటన

తిమ్మాజిపేట, నవంబర్ 28 : తిమ్మాజిపేట మండలం గొరిట ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థత కు గురైన ఘటన చోటుచేసుకున్నది. విద్యార్థుల కథనం ప్రకారం.. మధ్యాహ్నం 12:15 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో టమాట రైస్, గుడ్డు పెట్టారు. 3:30గంటలకు నలుగురు విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. వెంటనే ఉపాధ్యాయులు వైద్యులను పిలిపించి పాఠశాలలోనే చికిత్స చేయించారు. కాగా, సమాచారం తెలుసుకున్న ఎంఈవో సత్యానారాయణశెట్టి పాఠశాలను సందర్శించి, విద్యార్థుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అందరూ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు.


అయిజ పట్టణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

# ప్రతి ఇంటికీ భగీరథ నీళ్లు

అయిజ, నవంబర్ 28 : మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీళ్లు పుష్కలంగా అందించేందుకు కృషి చేస్తున్నట్లు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. పట్టణంలోని హైలెవల్ వంతెన కారణంగా ధ్వంసమైన మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించగా.. గురువారం ఎమ్మెల్యే విజయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూరాల నుంచి వచ్చే మిషన్ భగీరథ నీటిని ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా పట్టణంలోని అన్ని ఓవర్ హెడ్ ట్యాంకులను నింపి పట్టణంలోని నల్లాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ హయాంలోనే ఇంటింటికీ నల్లాలను బిగించి నీటిని అందిస్తున్నామన్నారు. పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా అందించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. లీకేజీలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసి పట్టణ ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దేవన్న, ఇన్‌చార్జి కమిషనర్ రాజయ్య, మున్సిపల్ ఏఈ రాజశేఖర్, బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు రంగారెడ్డి, నర్సింహారెడ్డి, మహబూబ్, బీఆర్‌ఎస్వీ నాయకుడు వీరేశ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# నేడే దీక్షాదివస్

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి
- జిల్లాకో ఇన్‌చార్జిల నియామకం
- ఇప్పటికే నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు
- వేలాది మందితో నిర్వహణకు ఏర్పాట్లు


వనపర్తిలో జెండాలను పాతుతున్న నేతలు


మహబూబ్‌నగర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మలిదశ తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి చావు నోట్లో తలపెట్టి తెలంగాణ సాధించారు. ఈ దశలో మళ్లీ పార్టీలో నూతన ఉత్తేజం రగిలించేందుకు మలిదశ పోరాటంలో భాగంగా 2009 నవంబర్ 29న చేపట్టిన దీక్షతో కేంద్రం దిగివచ్చి డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ దీక్ష ఫలితమే తెలంగాణ ఏర్పాటుకు నాంది పలికింది. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేండ్లు అన్నిరంగాల్లో అభివృద్ధిలో పరుగులు పెట్టించి దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిపారు. కాగా, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నది. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోయి గోసపడుతున్నారు. ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో తిరగబడుతున్నారు. మళ్లీ కేసీఆర్ రావాలంటూ కోరుకుంటున్నారు. కేసీఆర్ దీక్షను స్మరించుకునేందుకు శుక్రవారం అన్ని జిల్లా కేంద్రాల్లో దీక్షా దివస్ కార్యక్రమాన్ని భారీ ఎత్తున చేపడుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అన్ని జిల్లా పార్టీ కార్యాలయాల్లో దీక్షా దివస్ పెద్ద ఎత్తున చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తలను సిద్ధం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాజీ మంత్రులు, అలంపూర్ ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు పెద్ద ఎత్తున జన సమీకరణ చేస్తున్నారు.

***మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో..***

ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమం చేపడుతున్నారు. ఇప్పటికే ఈ ఐదు జిల్లాలకు పార్టీ సీనియర్ నేతలను ఇన్‌చార్జీలుగా నియమించారు. ఇప్పటికే సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తలను భారీ ఎత్తున తరలించేందుకు సమాయత్తం చేశారు.

## కేసీఆర్ దీక్షతోనే రాష్ట్ర సాధన



తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అంటూ గులాబీ బాస్ చేపట్టిన దీక్ష తెలంగాణ రాష్ట్ర సాకారానికి ఎంతో ఊతమిచ్చింది. దీక్షలో కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తోందన్న సమాచారంతో బంద్‌లు, నిరసనలు వెల్లువెత్తాయి. ఎటు చూసినా జై తెలంగాణ నినాదమే వినిపించింది. బస్సులు, రైళ్లు స్తంభించిపోయాయి. విద్యార్థులు, లాయర్లు, ఇంజినీర్లు, మేధావులు, రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు ఇలా నాలుగున్నర కోట్లమంది ఒక్కటయ్యారు. గెజిటెడ్ ఉద్యోగులు సైతం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఇక కేంద్రం దిగిరాక తప్పలేదు. నాతోపాటు చాలా మందిమి కేసీఆర్ ఆరోగ్యంపై ఆందోళన చెందాం. దీక్ష విరమించాలన్నా ఆయన వినకుండా కేంద్రం దిగొచ్చే వరకు దీక్ష చేపట్టారు. ఫలితంగా కేంద్రం తెలంగాణ ఇస్తున్నట్లు సంకేతాలు ఇస్తూ దివంగత ప్రొఫెసర్ జయశంకర్‌కు వర్తమానం పంపింది. డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియకు కేంద్రం సానుకూలంగా స్పందించడంతో కేసీఆర్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశాం.

*- శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి*

# సక్సెస్‌తో సొసైటీలో మార్పు

- సినీ నటుడు విజయ్ దేవరకొండ


మాట్లాడుతున్న సినీ హీరో విజయ్ దేవరకొండ

కొల్లాపూర్, నవంబర్ 28 : సక్సెస్ మన జీవితంతోపాటు సొసైటీలో కూడా ఎంతో మార్పు వస్తుందని సినీ నటుడు విజయ్ దేవరకొండ అన్నారు. కొల్లాపూర్‌లోని రాజావారి బంగ్లాలో రాణి ఇందిరాదేవి విద్యాసంస్థల్లో చదివిన పూర్వ విద్యార్థులతో స్వర్ణోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలకు విజయ్ దేవరకొండ హాజరు కాగా, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ కొల్లాపూర్ ఎంతో అభివృద్ధి చెందిందని, ఈ ప్రాంతంతో ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. ఇక్కడి ఆర్‌ఐడీ పాఠశాల నుంచి భారత దేశంతోపాటు అమెరికా ఇతర దేశాల్లోని 14 బిట్స్‌పిలాని లాంటి గొప్ప యూనివర్సిటీలకు వైస్ చాన్స్‌లర్స్‌గా, చైర్మన్లుగా ఉండడం అభినందనీయమన్నారు. ఇక్కడి స్కూల్ నుంచి మై హోం చైర్మన్ రామేశ్వర్‌రావు, బిట్స్‌పిలాని వైస్ చాన్స్‌లర్ రాంగోపాల్‌రావు గొప్ప స్థాయిలో ఉన్నారని తెలిపారు. తన అమ్మ, మామయ్య ఇక్కడే చదువుకోవడంతో ఇక్కడి వారితో బంధుత్వం ఉందన్నారు. అనంతరం ఆర్‌ఐడీ పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కాగా, స్వర్ణోత్సవంలో భాగంగా ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్‌ఎస్ తమన్ బృందంతో శుక్రవారం సాయంత్రం కొల్లాపూర్‌లో మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మైహోం అధినేత రామేశ్వర్‌రావు, యశోద దవాఖాన డైరెక్టర్ సురేందర్‌రావు ఉన్నారు.

# అధికారుల హైడ్రామా

- పాఠశాలలోకి మీడియాను అనుమతించని పోలీసులు
- ఫుడ్ పాయిజన్ ఘటనపై మహిళా కమిషన్ చైర్మన్ శారద విచారణ
- పురుగుల అన్నం పెడుతున్నారంటూ విద్యార్థుల ఆవేదన
- అధికారులు తమపై నెట్టడం సరికాదు, చిరుతిండ్లు తినలేదని స్పష్టీకరణ



మాగనూరులో కిరాణాదుకాణాలను తనిఖీ చేస్తున్న ఆర్డీవో, పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు

ఊట్కూర్ (మాగనూరు), నవంబర్ 28 : మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఫుడ్ పాయిజన్ వరుస ఘటనలపై అధికారుల తీరు హైడ్రామాను తలపిస్తోంది. ఈనెల 20వ తేదీన 100 మంది విద్యార్థులు వాంతులు, కడుపునొప్పి అస్వస్థతకు గురి కాగా, 15 మంది విద్యార్థులు మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానలో కోలుకునేందుకు ఐదు రోజులు పట్టింది. పాఠశాలలో కుళ్లిపోయిన కోడి గుడ్లు, పురుగులు పట్టిన బియ్యంతో భోజనం వడ్డించడంతోనే ఫుడ్ పాయిజాన్‌కు కారణమైనట్లు భావించి వంట ఏజెన్సీని రద్దు చేశారు. అలాగే హెచ్‌ఎం, ఫుడ్ ఇన్‌చార్జి ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు వేశారు. సంఘటన జరిగిన మరుసటి రోజే విద్యార్థులకు పురుగుల అన్నం వడ్డించడంతో సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ కాగా, కలెక్టర్ పర్యవేక్షణ అధికారులకు షోకాజ్ నోటీసులు అందించారు. తాజాగా పాఠశాలలో 40 మందికి ఫుడ్ పాయిజన్ అయిన ఘటనపై బుధవారం హైకోర్టు సైతం ఆగ్రహం వ్యక్తం చేసింది. వారం రోజుల వ్యవధిలో మూడు సార్లు ఫుడ్ పాయిజన్‌కు గురైతే అధికారులు నిద్రపోతున్నారా అంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నాన్ బెయిలబుల్ కేసు జారీ చేస్తే 5 నిమిషాల్లో అధికారులు ఇక్కడకు వచ్చి రిపోర్టు చేస్తారని మండిపడింది. హైకోర్టు ఆదేశాలతో అప్రమత్తమైన అధికారులు గురువారం పాఠశాలలోకి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు యూట్యూబ్ ఛానళ్లను పూర్తిగా నిషేధించారు. బయటి వ్యక్తులు పాఠశాలలోకి వెళ్లకుండా మెయిన్ గేట్ వద్ద పోలీసులను కాపలా ఉంచారు. విద్యార్థుల మానసిక స్థితిగతులతోపాటు మధ్యాహ్న భోజనం, వసతులను తెలుసుకునేందుకు ప్రయత్నించిన మీడియా ప్రతినిధులను మక్తల్ సీఐ చంద్రశేఖర్, మాగనూర్ ఎస్సై అశోక్‌బాబు మధ్యాహ్నం వరకు గేటు వద్దనే అడ్డుకున్నారు. మధ్యాహ్నం 12గంటలకు జిల్లా అడిషనల్ కలెక్టర్ బెన్‌షాలోమ్ పాఠశాలలోకి వెళ్లారు.

***పురుగుల అన్నం పెడుతున్నారు మేడమ్..***

మాగనూర్ పాఠశాలను మధ్యాహ్నం 3 గంటల సమయంలో తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ శారద సందర్శించారు. ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. అధికారులు, ఉపాధ్యాయులతో సమావేశమై సంఘటనకు గల కారణాలను తెలుసుకున్నారు. పాఠశాలలో కిచెన్, స్టోర్ రూం, వాష్ రూం గదులను పర్యవేక్షించారు. తరగతుల వారీగా తిరుగుతూ విద్యార్థులకు సమస్యలుంటే ఉమెన్ కమిషన్ టోల్ ఫ్రీ నెంబర్‌కు నేరుగా తెలుపాలని, విద్యార్థుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చైర్మన్‌తో సమస్యలు చెప్పారు. ఉడికీ ఉడకని కూరగాయలతో పురుగుల అన్నం వడ్డిస్తున్నారని, వాష్ రూంలు శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతున్నాయని, రోజూ కలుషితమైన నీటినే తాగుతున్నామని వాపోయారు. షాపుల్లో కుర్‌కురేలు, బిస్కెట్లు, చాక్లెట్లు తిన్నందుకు తినగా ఫుడ్ పాయిజాన్ అయ్యిందని అధికారులు అంటున్నారని, కానీ మేం బయటకు వెళ్లిందే లేదన్నారు. ఆఫీసర్లు చెప్పేవన్నీ అబద్ధాలని స్పష్టం చేశారు. ఇకపై ఏ పొరపాటు జరిగినా అధికారులదే పూర్తి బాధ్యతని ఆర్డీవో రాంచందర్, తాసీల్దార్ సురేశ్, ఎంఈవో అనిల్‌గౌడ్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎంను హెచ్చరించారు. పరిశీలనలో వెల్లడైన వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మీడియా సమావేశంలో పేర్కొన్నారు. కాగా, ఫుడ్ పాయిజన్ ఘటనతో గురువారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటలను మీడియా కంటపడకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. మహిళా సంఘాలకు చెందిన ముగ్గురు మహిళలతోపాటు పాఠశాల సిబ్బందితో భోజనం తయారు చేయించారు. విద్యార్థులకు అన్నం, క్యారెట్, ఆలుగడ్డతో తయారు చేసిన పప్పు సాంబారును వడ్డించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ శారద

***తగ్గిన విద్యార్థుల హాజరు శాతం..***

మాగనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వారం రోజుల వ్యవధిలో విద్యార్థులు మూడు సార్లు ఫుడ్ పాయిజన్‌కు గురై అస్వస్థతకు గురికావడంతో హాజరు శాతం రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నది. మొత్తం 590 మంది విద్యార్థులు బడికి హాజరు కావాల్సి ఉండగా గురువారం కేవలం 270 మంది మాత్రమే హాజరయ్యారు. వచ్చిన వారిలో దాదాపు సగం మంది విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకొని తిన్నట్లు తెలిసింది.

***దుకాణాల్లో తనిఖీలు..***

మాగనూరు, నవంబర్ 28 : కిరాణా దుకాణాల్లో నాణ్యతలేని వస్తువులను అమ్మితే షాపులను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఆర్డీవో రామచంద్ర హెచ్చరించారు. తాసీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్‌ఐ శ్రీశైలంతో కలిసి ఆర్డీవో కిరాణ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు.


చీఫ్ ఇంజినీర్ చాంబర్‌లో నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న ఇంజినీర్లు

# సాధారణ బదిలీలు చేపట్టాలి

- జెన్‌కోలో ఇంజినీర్ల నిరసన

దోమలపెంట, నవంబర్ 28 : సాధారణ బదిలీలు చేపట్టాలని నిరసిస్తూ అమ్రాబాద్ మండలం దోమలపెంట టీజీ జెన్‌కో శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భజల విద్యుత్ కేంద్రంలోని చీఫ్ ఇంజినీర్ చాంబర్‌లో ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సాధారణంగా ప్రతి సంవత్సరం బదిలీలు చేపట్టాల్సి ఉండగా, యాజమాన్యం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు చేపట్టినా, జెన్‌కోలో బదిలీలు చేపట్టలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ముగ్గురు సీఎండీలు మారడం, పూర్తిస్థాయిలో డైరెక్టర్లు లేకపోవడం వంటి కారణాలతో బదిలీల ప్రక్రియను పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. పలుమార్లు బదిలీల అంశంపై యాజమాన్యానికి విన్నవించినా ఫలితం లేదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ, ఏడీఈ మదన్‌మోహన్‌రెడ్డి, ఏఈ అసోసియేషన్ బ్రాంచ్ సెక్రటరీ చరణ్, రామకృష్ణ, కోశాధికారి కుమార్ సాగర్, ఏఈ రవి, రామ్మోహన్, నరేందర్, సందీప్, హరీశ్, జోషి, రఫీ, అల్మాస్ పాల్గొన్నారు.

# భయం గుప్పిట్లో గురుకుల విద్యార్థులు

- మదనాపురం పాఠశాల నుంచి స్వస్థలాలకు తరలిన పయనం



రోధిస్తున్న ప్రవీణ్ కుటుంబసభ్యులు, తల్లిదండ్రులతో కలిసి పాఠశాల నుంచి స్వస్థలాలకు తరలివెళ్తున్న విద్యార్థులు

మదనాపురం, నవంబర్ 28 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ప్రవీణ్ గురుకుల డార్మెంటరీ రూంలో బుధవారం ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతిచెందిన విషయం విధితమే. ఈ క్రమంలో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. దీంతో ఉపాధ్యాయులు 5 నుంచి పదో తరగతి విద్యార్థులకు రెండు రోజులపాటు సెలవు ప్రకటించి స్వస్థలాలకు తరలించారు.

***కొన్నూరులో ప్రవీణ్ అంత్యక్రియలు..***

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం అనంతరం ప్రవీణ్ భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా, కొన్నూరుకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఎదుగుతున్న కొడుకు ఒక్కసారిగా దూరమవడంతో తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా మారింది. విషాదఛాయలు అలుముకున్నాయి.

***అనుమానాస్పద మృతిగా కేసు నమోదు..***

ఉపాధ్యాయులు పట్టించుకుంటే నా కొడుకు ఆత్మహత్య చేసుకునేవాడు కాదేమోనని ప్రవీణ్ తండ్రి వాపోయాడు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా నిండుప్రాణం పోయిందని తల్లిదండ్రులు విలపించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.


మిల్లు వద్ద మంటలను అదుపుచేస్తున్న సిబ్బంది

# కాటన్‌మిల్లులో అగ్ని ప్రమాదం

నారాయణపేట రూరల్, నవంబర్ 28 : నారాయణపేట మండలం లింగంపల్లి శివారులోని భాగ్యలక్ష్మి కాటన్ మిల్లులో గురువారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఆకస్మాత్తుగా సీసీఐ ద్వారా కొనుగోలు చేసిన పత్తి తగలబడుతుండటంతో అక్కడున్న వారు ఆర్పేందుకు ప్రయత్నించారు. వెంటనే యజమాని శ్రీనివాస్ లాహోటి ఫైర్ అధికారులకు సమాచారం అందించగా, జిల్లా ఫైర్ ఆఫీసర్ సురేశ్‌రెడ్డి, ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ రమేశ్‌రెడ్డి సిబ్బందితో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. పత్తి ఎక్కువ మొత్తంతో తగలబడుతుండటంతో అధికారులు మక్తల్, కొత్తకోట, ఆత్మకూర్ నుంచి ఫైర్ ఇంజన్లను తెప్పించి మంటలను ఆర్పేందుకు కృషి చేస్తున్నారు. మిల్లును డీఎస్పీ లింగయ్య, రూరల్ ఎస్సై రాముడు పరిశీలించి ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు. సీసీఐ అధికారులు కూడా అక్కడికి చేరుకొని సంఘటనపై ఆరా తీసినట్లు సమాచారం. పత్తి సుమారుగా 10వేల క్వింటాళ్లు ఉండవచ్చునని, రూ.6కోట్ల విలువ ఉంటుందని అంచనా. అధికారులు,పోలీసులు విచారణ పూర్తి చేశాక పత్తి నష్టం విలువ తెలవనుంది.



జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

# పనిచేసి పస్తులుండాలా..?

గద్వాల, నవంబర్ 28 : అరకొర వేతనాలతో పస్తులుండి పనిచేస్తే 10 నెలలుగా వేతనాలు చెల్లించకుండా సర్కారు కాలయాపన చేయడం తగదని బీఆర్‌ఎస్ నేత గంజిపేట రాజు అన్నారు. గురువారం కలెక్టరేట్ వద్ద తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్, ఇఫ్ట్యూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాజు కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య, నర్సరీ, వాటర్‌మెన్లు, వీధిదీపాల నిర్వహణ, తదితర విభాగాల్లో కార్మికులు పని చేస్తుండగా, వారికి 10నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు పస్తులుండాల్సి వస్తుందన్నారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి అధికారంలోకి వస్తే వేతనాలు పెంచి ఇస్తామని గొప్పలు చెప్పి ఉన్న వేతనాలు కూడా ఇవ్వకపోవడం విచారకరమన్నారు. కార్మికులకు రెండుజతల బట్టలు, సబ్బులు, నూనె, ఇతర పరికరాలు ఇవ్వాల్సి ఉండగా వాటిని పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని.. లేకుంటే అందరం ఏకమై ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# వైద్యుల నిర్లక్ష్యానికి బాలింత మృతి

- పరీక్షించాలని వేడుకున్నా పట్టించుకోని సిబ్బంది
- ఎవరో ఒకరు చనిపోతే ఏమైందంటూ బుకాయింపు
- దవాఖానలో బాధిత కుటుంబసభ్యుల ఆందోళన


సిబ్బందిపై బాధిత కుటుంబ సభ్యుల ఆగ్రహం

మహబూబ్‌నగర్, నవంబర్ 28 : పండంటి బిడ్డకు జన్మనిచ్చానని ఆనందపడేలోపే వైద్యుల నిర్లక్ష్యం యముడి రూపంలో వచ్చి ఓ మాతృమూర్తి ప్రాణాన్ని అమాంతం హరించిన ఘటన మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో చోటుచేసుకున్నది. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన గర్భిణి రజిత(35)కు శనివారం నొప్పులు రావడంతో మహబూబ్‌నగర్ దవాఖానకు ప్రసవం కోసం వచ్చింది. పరీక్షించిన వైద్యులు ఇంకా ప్రసవ సమయం కాలేదని, గురువారం రమ్మని చెప్పి పంపించారు. బుధవారం మళ్లీ నొప్పులు రావడంతో ఆశకార్యకర్త సాయంతో జిల్లా దవాఖానకు వచ్చింది. వైద్యులు అంతాబాగానే ఉంది.. గురువారం డెలివరీ చేస్తామని చెప్పి గైనిక్ వార్డులో అడ్మిట్ చేశారు. రాత్రి 8:30 గంటలకు నొప్పులు అధికం కావడంతో వైద్య సిబ్బందికి విషయం చెప్పారు. సిజేరియన్ చేయగా, మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం రజితను బాలింతల వార్డుకు షిఫ్ట్ చేశారు. కొంత సమయానికి తీవ్రంగా నొప్పులు వస్తున్నాయని వైద్య సిబ్బందికి చెప్పగా, పట్టించుకోకుండా డాక్టర్లు వచ్చి చూస్తారని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. గురువారం తెల్లవారుజామున మళ్లీ కాళ్లు, చేతులు గుంజుతున్నాయని చెప్పగా, పరీక్షించి వెంటనే ఐసీయూకి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించి 6 గంటల ప్రాంతంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆరోగ్యం బాగాలేదని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా చనిపోయిందని చెబుతారా అంటూ కుటుంబ సభ్యులు వైద్యసిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. సరైన సమయంలో వైద్యం అందించి ఉంటే బతికేదని, నిర్లక్ష్యం కారణంగానే తన భార్య చనిపోయిందని ప్రకాశ్‌రెడ్డి వాపోయాడు. పరీక్షించాలని ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోకుండా బెదిరింపులకు గురిచేసి ప్రాణాన్ని బలిగొన్నారని మండిపడ్డారు.

***ఒకరు చనిపోతే ఏమైంది..?***

పసిపాపకు తల్లిని పోగొట్టుకున్న దుఃఖంలో కుటుంబం వైద్యుల తీరును ప్రశ్నిస్తే ఇందుకు ఓ వైద్యురాలి తీరు సభ్యసమాజం తలదించుకునేలా మారింది. దవాఖానలో ఎన్నో డెలివరీలు చేస్తున్నాం.. ఒకరి చనిపోతే మాపై నిందలు మోపుతారా అనడంపై అక్కడున్న వారంతా అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంతో ఒకరి ప్రాణాలు కోల్పోయేందుకు కారకులు కావడంతోపాటు తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటని మండిపడ్డారు. కాగా, విధుల్లో నిర్లక్ష్యం వహించి తన భార్య మరణానికి కారణమైన వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని దవాఖాన సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్‌కు మృతురాలి భర్త ప్రకాశ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ హామీ ఇవ్వగా, అక్కడి నుంచి బాధిత కుటుంబ సభ్యులు శవాన్ని తీసుకెళ్లారు.

# కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో సస్పెన్షన్

నవాబ్‌పేట, నవంబర్ 28 : నవాబ్‌పేట కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో ప్రశాంతిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ విజయేందిర బోయి గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తాసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థినులతో పూరీలు చేయిస్తుండగా, తొమ్మిదో తరగతికి చెందిన జల్సాకు గాయాలైన నేపథ్యంలో కలెక్టర్ చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కాగా, ఎస్‌వో ఏడాదిలో రెండు, మూడు పర్యాయాలు దీర్ఘకాలిక సెలవుపై వెళ్తోందని, ఈ సమయంలోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తెలిసీతెలియని వారికి ఇన్‌చార్జి ఇవ్వడంతోనే ఘటనలు జరుగుతున్నాయని వాపోతున్నారు.